క్లుప్తంగా

నేడు బంగారుపాప తీర్థం

కొత్తపేట: గ్రామదేవతగా, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా విరాజిల్లుతున్న బంగారుపాప అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే సోమవారం తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ప్రకారం ఆదివారం రాత్రి పెద్ద జాగరం నిర్వహించగా సోమవారం తీర్థం జరుగుతుంది. తీర్థానికి నెల రోజుల ముందు నుంచీ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబ్జి ఆధ్వర్యంలో జాతర, తీర్థ మహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామస్తులతో పాటు ఉద్యోగ, ఉపాధి పేరిట, వివాహాలతో అత్తవారిళ్లకు వెళ్లిన గ్రామ ఆడపడుచులు విధిగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు సమర్పిస్తారు.

వైభవంగా మాచేనమ్మ జాతర

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయలవారి పాలెంలో వేంచేసిన మాచేనమ్మ వారి జాతర మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, కేరళ తీన్‌మార్ వాయిద్యాల ప్రదర్శనలతో కళాకారులు ఆకట్టుకున్నారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలకు గ్రామస్తులు, వినాయక యువజన సంఘ సభ్యులు ఆధ్వర్యం వహించారు.

ఘనంగా వనువులమ్మ తీర్థం

అంబాజీపేట: చిరతపూడిలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి నిర్వహించిన జాతరలో గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

అంబాజీపేట: ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గాను పౌర గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కథలు చెప్పడం, కథలు రాయించడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ సైన్స్ ప్రాజెక్టు, వేదిక్ మాథ్స్, పేపర్ ఆర్ట్ కటింగ్స్, సంగీతం మొదలైన కార్యక్రమాలు ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ అనంతరం సమ్మర్ క్యాంప్ ధ్రువపత్రాలు ఇవ్వనున్నామన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

ఆలమూరు: ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాసంశెట్టి వసంతలక్ష్మి ఆర్థిక సాయం లభించింది. సూర్యారావుపేటకు చెందిన ఆమెకు ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ ఈమేరకు రూ.పది వేల విరాళాన్ని ఆదివారం కుటుంబ సభ్యులు అందజేశారు. నాణ్యమైన వైద్యసాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చేపల మార్కెట్ షెడ్డు ప్రారంభం

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు సమీపాన పంచాయతీ నిధులతో నిర్మించిన చేపల మార్కెట్ షెడ్డును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ బొండాడ నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేపల వ్యాపారులు చిట్టిబాబును సత్కరించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీటీసీ పులపర్తి వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దాసరి కాశీ, శేరు శ్రీనుబాబు, కోనసీమ చేపల వర్తక సంఘ అధ్యక్షుడు ధర్మాడి ఏడుకొండలు, ఉప సర్పంచ్ కర్రి బాబూరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో సాయం అందించాలి

ఆలమూరు: అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన వరి రైతులకు ఎన్ఆర్‌జీఈఎస్ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో సాయం అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జొన్నాడ పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకు రైతులకు కూలీల అవసరం ఎంతో ఉందన్నారు. రోజుల తరబడి తడిసిన ధాన్యాన్ని రాశులుగా పోసి మళ్లీ ఆరబెట్టుకోవడం వల్ల కూలీల ఖర్చు అధికమవుతుందన్నారు. దీనివల్ల రైతుపై అదనపు భారం పడి తీవ్రంగా నష్ట పోతున్నందున ఎన్ఆర్ఈజీఎస్ సత్వరమే స్పందించి ఉపాధి కూలీలతో సాయం అందించే విధంగా సత్వర సేవలు అందించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 1988–93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో మజ్జిగ పంపిణీతో పాటు, ప్లాస్టిక్ విసనకర్రలను వారు ప్రజలకు అందజేశారు. కాగా గత 5 సంవత్సరాలుగా చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. బోణం రామ్‌కుమార్, అడ్డాల నాగ వెంకట లక్ష్మి, జక్కంపూడి నాగేశ్వరావు, చింతా కిరణ్‌కుమార్, బి.నాగ మల్లేశ్వరరావు, గుర్రం రాజు, శ్రీధర్‌కృష్ణ పాల్గొన్నారు.



మామిడికుదురులో విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కష్టపడేశారు

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- అభినందించిన అధికారులు

మామిడికుదురు/అయినవిల్లి/పి.గన్నవరం/కొత్తపేటలమూరు/రావులపాలెం/సఖినేటిపల్లి/అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో కష్టపడి చదివి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించి విద్యార్థులు సత్తా చాటారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఆ విద్యార్థులను ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల నుంచి అభినందనలు అందుకుంటున్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు వారి కుటుంబ నేపథ్యాలు, వారి లక్ష్యాలను పరిశీలిద్దాం.

కష్టపడి చదివిస్తున్నారు



ముంగండ ఉన్నత పాఠశాలకు చెందిన మంతెన సాహిత్య 573 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకుంది. తండ్రి రామ సూర్య శంకరం తాపీ మేస్త్రిగా పని చేస్తారు. తల్లి విజయలక్ష్మి గృహిణి. తన తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, బీటెక్ పూర్తి చేసి ఇంజినీర్‌ను అవుతానని సాహిత్య తెలిపింది.

– మంతెన సాహిత్య, ముంగండ ఉన్నత పాఠశాల

సివిల్స్‌లో రాణించాలన్నదే లక్ష్యం



పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కేతా జయశ్రీ 572 మార్కులు సాధించి మండల స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించింది. తండ్రి శ్రీను జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో పని చేస్తున్నారు. తల్లి గృహిణి. బీటెక్ పూర్తి చేసి సివిల్స్‌లో రాణించాలన్నదే లక్ష్యమని జయశ్రీ తెలిపింది.

– కేతా జయశ్రీ, పి.గన్నవరం ఉన్నత పాఠశాల

ఐఏఎస్‌నవుతా..



రావులపాలెం మండల వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సయ్యపురాజు వివేక్ సాయి తేజ వర్మ 572 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూల్స్ తరఫున మండల టాపర్‌గా నిలిచాడు. తండ్రి నాగవెంకటరామకృష్ణవర్మ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్. తల్లి జ్యోతిర్మయి గృహిణి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చదివి తరువాత ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం అని చెప్పాడు.

– ఎస్‌వీఎస్ తేజావర్మ, వెదిరేశ్వరం

టీచర్ అవుతాను



రావులపాలెం మండలం వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దండు షణ్ముకి సాయి కృష్ణప్రియ 571 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానం సాధించింది. తండ్రి వెంకట సూర్య సత్య సుబ్బరాజు ప్రైవేట్ ఉద్యోగి. తల్లి సత్యవాణి గృహిణి. బీఈడీ చేస్తాను టీచర్ వావాలన్నదే లక్ష్యమని చెప్పింది.

– దండు ఎస్ఎస్ కృష్ణప్రియ వెదిరేశ్వరం

సివిల్స్ తన లక్ష్యం..



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రావి రామ్‌గోపాల్‌నాగ ఆదిత్య తేజ 572 మార్కులు సాధించాడు. నాలుగేళ్ల కిత్రమే తండ్రి మృతి చెందడంతో తల్లి సంతోషి నాగమణి, తాతయ్య, నానమ్మల ప్రోత్సాహంతో చదువుతున్నాను. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించడమే తన లక్ష్యమని చెప్పాడు.

– రావి ఆర్‌ఎన్‌ఏ తేజ, జెడ్పీ హైస్కూల్, అంబాజీపేట

ప్రణాళికతో చదువుకున్నాను



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కర్రా స్వర్ణగీత 570 మార్కులు సాధించింది. మండలంలో రెండో టాపర్‌గా నిలిచింది. తండ్రి శ్రీనివాస్ చిరు వ్యాపారి. తల్లి శేషకుమారి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే లక్ష్యమని తెలిపింది.

– కర్రా స్వర్ణగీత, జెడ్పీ హైస్కూల్, అంబాజీపేట

శాస్త్రవేత్త కావడమే ధ్యేయం



అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సవరపు వెంకట సత్యదుర్గ సుభాష్ పదో తరగతిలో 570 మార్కులు సాధించి మండలంలో ప్రథమంగా నిలిచాడు. సుభాష్ తండ్రి వెంకటస్వామి చిరు వ్యాపారి. తల్లి గృహిణి. శాస్త్రవేత్త కావడమే తన లక్ష్యమని సుభాష్ తెలిపాడు.

– సవరపు వెంకట సత్యదురసుభాష్, వీరవల్లిపాలెం

ఇంజినీర్‌గా స్థిరపడతా..



వీరవల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కోరపు రేష్మ ఇంజినీర్‌గా స్థిరపడతానని తెలిపింది. పదిలో 567 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. తండ్రి రవి వ్యవసాయం చేస్తుంటారు. తల్లి వెంకటరమణ గృహిణి. తనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు.

– కోరపు రేష్మ, వీరవల్లిపాలెం

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం



మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకే చెందిన చింతా నాగ వసంత కూడా 564 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. తండ్రి నాగశ్రీనివాసరావు చేనేత కార్మికుడు. తల్లి విజయలక్ష్మి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది తన ఆశయమని ఆమె పేర్కొంది.

– చింతా నాగవసంత, మొగలికుదురు, మండల టాపర్

ఇంజినీర్ కావాలని..



మూలస్థాన అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తోరాటి హేమలత 565 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల తరఫున ప్రథమ స్థానం సాధించింది. తండ్రి రామ్‌ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. తల్లి రామలక్ష్మి, తాతయ్య, నానమ్మలు పల్లయ్య, సత్యవతిల ప్రోత్సాహంతో అత్యధిక మార్కులు సాధించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని హేమలత తెలిపింది.

– హేమలత, మూలస్థాన అగ్రహారం

సాఫ్ట్‌వేర్ ఇంజినీరవుతా..



కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నెల్లి జైశ్యామ్ 561 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. తండ్రి రవివర్మ వ్యవసాయ కూలి. తల్లి నాగజ్యోతి గృహిణి. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది తన లక్ష్యమని తెలిపాడు.

– నెల్లి జైశ్యామ్, గోగివారిపేట, కొత్తపేట

చార్టర్డ్ అకౌంటెంట్ అవుతా



రావులపాలెం జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన పుల్య కుమార సాయి త్రిశ్రీరూపిత 566 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూల్స్ తరఫున మండల తృతీయ స్థానం సాధించింది. తల్లిదండ్రులు కామాక్షి, శివశంకరరావు ఇద్దరూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివింది. అమ్మే నాకు మొదటి టీచర్. చార్టెడ్ అకౌంట్ (సీఏ) కావాలన్నదే లక్ష్యం అని చెప్పింది.

– పీకేఎస్ త్రిశ్రీరూపిత, రావులపాలెం

ఎంతో కష్టపడి చదువుకున్నాను



మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పిచ్చిక వైష్ణవి 564 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూల్స్ తరఫున మండల టాపర్‌గా నిలిచింది. తండ్రి కుమారగౌరీశంకరరావు చేనేత కార్మికుడు, తల్లి లక్ష్మీకాంతం గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

– పిచ్చిక వైష్ణవి, మొగలికుదురు, మండల టాపర్

జడ్జి కావాలనుకుంటున్నాను



టేకిశెట్టిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన జంగా జయ శ్రీ సాయి 576 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. తండ్రి జంగా రాము రాజోలు కోర్టులో ఉద్యోగి. తల్లి దేవీ దుర్గ డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు. జడ్జి కావాలన్నదే తన లక్ష్యమని చెపింది.

– జంగా జయశ్రీసాయి, టేకిశెట్టిపాలెం

ఐఐటీలో సీటే లక్ష్యం



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాసిన లక్ష్మీ నాగ శ్రీజ 569 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలిచింది. తండ్రి బాసిన సత్తిబాబు చేనేత కార్మికుడు. తల్లి సూర్యకుమారి గృహిణి. ఐఐటీ చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

– బాసిన లక్ష్మీ నాగ శ్రీజ, మోరి

ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోకండి

ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రతిపక్షాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయని, ఆ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హితవు పలికారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం బి.దొడ్డవరంలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గాలు చూపారు. చిట్టిబాబు మాట్లాడుతూ గత పాలనకు నేటి పాలనకు తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. సంక్షేమ పథకాలతో పేదలకు ఎనలేని మేలు చేస్తున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. డ్వాక్రా రుణాల మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంటు, అమ్మ ఒడి, సున్నా వడ్డీ రాయితీ, రైతులకు ఆర్థికసాయం ఇలా ఎన్నో ఎన్నెన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్ ప్రజలకు ఆరాధ్య దైవంగా నిలిచారని చిట్టిబాబు కీర్తించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించని పక్షంలో ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెల్లుబోయిన రామ శివసుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, గ్రామ శాఖ అధ్యక్షుడు కేదారిశెట్టి మల్లి, కన్వీనర్లు వాకపల్లి వీరాస్వామి, బద్దే రామకృష్ణ, కాంట్రేగుల సత్యవతి, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, వాసంశెట్టి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బి.దొడ్డవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఘనంగా బుద్ధ జయంతి

మామిడికుదురు: ఆదుర్రు బౌద్ధ దివ్య స్థూపం వద్ద ఆదివారం బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా శాఖ, ఆదుర్రు బుద్ధ విహార్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సంప్రదాయ సాంస్కృతిక ఉత్సవాలను వైభవంగా జరిపించారు. ఆదుర్రు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్.రాజన్, బుద్ధ విహార్ వద్ద చింతా శ్రీరామమూర్తి పంచశీల పతాకాలను ఆవిష్కరించారు. దివ్య బౌద్ధ స్థూపం వద్ద పూజ్యభంతే అనాలయా ఆధ్వర్యంలో ప్రదక్షిణ, త్రిసరణ, పంచశీల సూత్రాలను పఠించారు. బుద్ధ విహార్‌లో బుద్ధ పూజ, బుద్ధ వందనం, దమ్మ వందనం, సంఘ వందన, చాంటింగ్, దమ్మ ప్రవచనం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పలు ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ట్రస్టీ తాడి సురేష్, మెండి ప్రతాప్‌కుమార్, కేవీవీ సత్యనారాయణ, ఆర్.మల్లికార్జునరావు, పిల్లి రాంబాబు, కేవీ రమణ, మట్టా సిద్ధార్థ గౌతమ్ పాల్గొన్నారు.



ఆదుర్రు బౌద్ధ స్థూపం వద్ద బుద్ధ జయంత్యుత్సవంలో పాల్గొన్న అనాలయా

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

ఆలమూరు: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా అండగా ఉండి తడిసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రైతులకు భరోసా కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి తడిసిన, మొక్కలు మొలిచిన ధాన్యం రాశులు పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం రానివ్వకుండా నేరుగా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు రైసుమిల్లర్లతో మాట్లాడి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విస్తృతమైన చర్యలు చేపట్టామన్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దియ్యన పెదకాపు పాల్గొన్నారు.



నవాబుపేటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

సొసైటీ పాలకవర్గాలు ఉత్తమ సేవలు అందించాలి

పి.గన్నవరం: సొసైటీ పాలక వర్గాలు రైతులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఊడిమూడి సొసైటీ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గిడ్డి రాంబాబు, సభ్యులుగా అప్పన వెర్రిబాబు, షేక్ అంకారత్ సాహెబ్‌లు ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇటీవల వర్షాలకు రంగు మారిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి పాటుబడతానని అన్నారు. తొలుత రాంబాబు భారీ ఊరేగింపుతో సొసైటీకి చేరుకున్నారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్నకుమార్, దంగేటి అన్నవరం, పార్టీ నాయకులు మంతెన రవిరాజు, కొండేటి వెంకటేశ్వరరావు, వికాస్‌బాబు, పందిరి పూర్ణచంద్రరావు, అడ్డాల రవి, కొల్లు రాంబాబు, గిడ్డి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి' ఒక మహోజ్వల శక్తి

రావులపాలెంలో ఘనంగా అల్లూరి వర్ధంతి

రావులపాలెం: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా రావులపాలెంలో హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ మహనీయుని విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి ఆ పోరాటంలోనే దేశం కోసం యవ్వన ప్రాయంలోనే ప్రాణాలు అర్పించిన వీరుడు అల్లూరి అని కొనియాడారు. అల్లూరి పేరు మీద కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురంలో రూ.కోటి తో ఒక పార్కు నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. అనంతరం 110 డిగ్రీలు పూర్తి చేసి మహనీయుడు అల్లూరి సీతారామరాజు గురించి పుస్తకం రచించిన ప్రొఫెసర్, సోషల్ సైంటిస్ట్ విశాఖపట్నంకు చెందిన పట్నాల జె.సుధాకర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ, సఖినేటి వాకులరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మట్టా బాబ్జి, స్కూల్ చైర్మన్ చిర్ల కనికిరెడ్డి, పడాల పరమారెడ్డి, క్షత్రియ యువత పాల్గొన్నారు.



రావులపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



మలికిపురంలో తాను గీసిన చిత్రాలు విద్యార్థులతో ప్రదర్శింపచేస్తున్న సంగీత్

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఆత్రేయపురం, మెర్లపాలెం, తాడిపూడి, వసంతవాడ, పులిదిండి తదితర గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పోరాట పటిమ గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, గాదిరాజు ప్రసాదరాజు, నంబూరి వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్వతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మండల బీజేపీ ఉపాధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అక్విడెక్టు పార్కులో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి వేమా తదితరులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గీసిన చిత్రాలతో అల్లూరికి ఘన నివాళులు

మలికిపురం: తాను గీసిన చిత్రాలతో మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజుకు ఆదివారం స్థానిక సునయన ఆర్ట్స్ అకాడమీ చిత్రకారుడు సంగీత్ నివాళులర్పించారు. సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మలికిపురంలో ఈ మేరకు స్వయంగా అల్లూరిపై గీసిన చిత్రాలను పిల్లలతో ప్రదర్శించి నివాళులర్పించారు. నేటి తరానికి సీతారామరాజు విశిష్టత గురించి అవగాహన చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

మైనార్టీ సెల్ కమిటీల ఏర్పాటు

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవ.కె.బాబూరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యాన ఆదివారం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల మైనార్టీ సెల్ నూతన కమిటీలు ఏర్పాటు చేశారు. కత్తిమండ క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ సాగింది. జిల్లా కమిటీలో కార్యదర్శిగా పాస్టర్ సీహెచ్ స్టీవెన్, మెంబర్స్‌గా పి.దుర్గాప్రసాద్, ఓ రమణలను నియమించారు. కాగా మామిడికుదురు మండల అధ్యక్షుడిగా పాస్టర్ పి.రాజు, రాజోలు మండలంకు పాస్టర్ జి.పౌల్, మలికిపురం మండలంకు పాస్టర్ ఎన్.శాంతిరాజు, సఖినేటిపల్లి మండలంకు పాస్టర్ జిల్లెళ్ల రాజు నియమించారు. 2024లో తిరిగి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి, రాజోలు ఎమ్మెల్యేగా రాపాక వరప్రసాదరావులను గెలుపునకు మైనార్టీ సెల్ కృషి చేస్తుందని బాబూరావు తెలిపారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమలు కాని హామీలపై అభియోగపత్రం

మామిడికుదురు: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాని పక్షంలో వాటిపై అభియోగపత్రం నమోదు చేస్తామని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం జరిగిన సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షత వహించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 11వ తేదీన మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద టెంట్ వేసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. 12వ తేదీ ఉదయం 10 గంటలకు పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో అభియోగపత్రం నమోదు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, కుడుపూడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చు పెట్టాలని కుట్ర

రావులపాలెం: దళితుల ఐక్యతను చాటేందుకు తలపెట్టిన బ్లూ మార్చ్‌ను కొందరు రాజకీయ స్వప్రయోజనాల కోసం ఎల్లో మార్చ్‌గా మార్చారని దళితుల మధ్య చిచ్చుపెట్టాలని ప్రతిపక్షాలకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీ దళితనాయకులపై సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారం చేసేలా పోస్టులు పెట్టారని ఇది రాజకీయ లబ్ధి కోసమే జరిగిన ప్రక్రియ తాము భావించి బ్లూ మార్చ్(నీలిక వాతు)కు దూరంగా ఉన్నామని పార్టీ దళిత నాయకులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, కప్పల శ్రీధర్, సాకా ప్రసన్నకుమార్‌లు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దళితుల ఐక్యతను చాటాలని నిర్వహణ కమిటీ మంచి ఉద్దేశంతోనే బ్లూ మార్చ్ చేపట్టిందని తాము కూడా సహాయ సహకారాలు అందించాలనుకున్నాం. అయితే టీడీపీకి చెందిన కొందరు నాయకులు ఈ మార్చ్ లో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు పాల్గొనరని, మిగిలినవారు హాజరవుతారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో రాజకీయంగా గొడవలు పెట్టేందుకు ప్రతిపక్షాలు ఇటువంటి పనులు చేస్తున్నాయని తాము గ్రహించి నీలి కవాతుకు దూరంగా ఉన్నామన్నారు. దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పెట్టిన పరిస్థితులను పోలీసులు ముందుగా గమనించి ఈ మార్చ్‌కి అనుమతులు ఇవ్వలేదన్నారు. దీనిని వైఎస్సార్ సీపీకి, స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి ఆపాదించేలా కొందరు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కొంతమంది చేసే అసత్యాలను దళిత జాతి నమ్మదని దళితులంతా వైఎస్సార్ సీపీ వెనుక ఉంటారన్నారు. తామంతా కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెనక నడుస్తామని వారు స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు కొల్లి శ్యాంసన్, కోనాల రాజు, కప్పల నాగేశ్వరరావు, సామ్యూల్, లక్ష్మణరావు, పాలంగి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు డేవిడ్, శ్రీధర్, ప్రసన్నకుమార్

స్వామి సన్నిధిలో పలువురు ప్రముఖులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో..

అయినవిల్లి: విఘ్నేశ్వరుని కడప మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ గోకరకొండ ప్రవీణ్‌చంద్ దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రవీణ్‌చంద్ దంపతులకు ఆలయ వేదపండితు వేదాశీర్వాదం పలికారు. స్వామి వారి విశిష్టతను వివరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన స్వామివారి నిత్యాన్నదాన సత్రానికి రూ.10,116 విరాళంగా అందజేశారు. అలాగే తెలంగాణ హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఏపీ స్పోర్ట్స్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కె.రంగారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించారు.